పట్టు తప్పిన చేనేత బతుకులు

- ముడిసరుకు అభించక మగ్గాలు ఎత్తేస్తున్న చేనేతలు
- ఆరు నెలలు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటున్న నేతన్న
- ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ విన్నపం

ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే చేనేతలకు అగ్రతాంబూలం ఇస్తామని ప్రగల్బాలు పలికిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 7 నెలలు కావస్తున్నా ఇచ్చిన మామీలను అమలు చేయకపోవడంతో చేనేత బతుకులు పట్టు తప్పాయి. ముడి సరుకులు లభించకపోవడంతో దాదాపు 2వేల మంది మగ్గం ఎత్తివేసిన సంఘటనలు సిద్దవటం మండలంలోని మాధవరం-1, ఉప్పరపల్లె, మాధవరం-1,2,3 వార్డుల గ్రామ పంచాయతీల్లో చోటు చేసుకున్నాయి


మాధవరం-1లో ముడిసరుకులు ఇచ్చేవారు లేక మగ్గం ఎత్తివేసిన చేనేత కార్మికుడు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1, ఉప్పరపల్లె, మాధవరం-1,2,3, వార్డుల గ్రామ పంచాయతీల్లోని మరికొన్ని గ్రామాలలో దాదాపు 10వేల మంది చేనేత కుటుంబాలు ఉండగా 2500 మంది చేనేత కార్మికులు నిత్యం మగ్గం నేస్తుండేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు కావలసిన ముడి సరుకులైన పడి, నూలు, పట్టు, జరి వంటివి ఇచ్చే ఆసాములు లేకపోవడంతో దాదాపు 2వేల మంది చేనేత కార్మికులు మగ్గాలను ఎత్తివేసి కుటుంబాలను పోషించుకునేందుకు బేల్దారు, వ్యవసాయ కూలీ, కడపలోని కర్మాగారాల్లో, వస్త్ర దుకాణాల్లో, నిత్యావసర వస్తువులు అంగళ్లలో పనులు చేసుకుంటూ జీవనం నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం కింద మగ్గం నేసే ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి సంవత్సరానికి రూ. 24వేలతోపాటుగా 45 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.18,750, కుటుంబంలో బడికి వెళ్లే పిల్లలకు ఒకరికి అమ్మఒడి పథకం కింద రూ. 15వేలతోపాటు చేనేత పింఛన్ వంటివి అందజేయడంతో ఇబ్బందులు లేకుండా జీవనాన్ని సంతోషంగా కొనసాగించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే నేతన్నలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా పెంపు, సబ్సిడీకే నూలు, వస్త్ర కొనుగోలుపై 20 శాతం రిబేట్ ఉండేలా మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వంలో వచ్చాక చేనేతలకు ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడంతో వారు చేసేది ఏమీలేక నిరాసలో ఉన్నారు. ఒక కుటుంబంలో ఇంటిల్లిపాది మగ్గం పనులు చేస్తే చీరను నేసేందుకు వారం రోజులు పడుతుంది. అందుకు రూ. 1200 ఇస్తున్నారు. నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఇప్పుడు ఉన్న యువత మగ్గం పనులపై ఆసక్తిని చూపడంలేదు. యువత అంతో ఇంతో చదువుకొని ఉండటంతో తల్లిదండ్రులకు సంపాదనలో చేదోడు, వాదోడుగా ఉండేందుకు ఏదో ఒక పని చేసుకుంటూ జీవిస్తున్నారు. పలువురు చేనేత కార్మికులు మగ్గం పనులు నేసేందుకు ఆసాములు నూలు పట్టు, జరి వంటి ఇస్తేనే మగ్గం నేస్తున్నారు, లేదంటే ఖాళీగా ఉంటున్నారు.

చేనేత కార్మికులకు రుణాలివ్వాలి



చేనేత కార్మికులకు ఆప్కో నుంచి రుణాలు ఇచ్చి నేసిన చీరలకు గిట్టుబాటు ధర కల్పించి ఆ చీరలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అప్పుడు ఇచ్చిన రుణాన్ని విడతల వారీగా కంతుల పద్ధతిలో రుణాన్ని తీర్చేలా అవకాశం ఇవ్వాలన్నారు. దీంతో దళారుల వ్యవస్థ అనేది ఉండదని తమ కుటుంబాన్ని సంతోషంగా పోషించుకుంటామన్నారు.

– అవ్వారు వెంకటసుబ్బయ్య, పార్వతీపురం, సిద్దవటం మండలం

మగ్గం పనులు ఆపేశాం



మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నాం. గత ప్రభుత్వంలో సంక్షేమ పథాకలు బాగా అందేవి, ప్రస్తుతం మగ్గం నేసేందుకు ముడిసరుకులు ఇచ్చే ఆసాములు లేక మగ్గం పనులు ఆపేశాం. కూటమి ప్రభుత్వ వచ్చాక చేనేతలను పూర్తిగా విస్మరించడంతో పలువురు నేతన్నలు మగ్గాలను వదిలి కుటుంబాన్ని పోషించేందుకు ఇతర పనులకు వెళుతున్నాం.

– గంజి రామలక్ష్మమ్మ, ఎస్‌కేఆర్ నగర్, సిద్దవటం మండలం

క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం


కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో వెలసిన శ్రీ రామాంజనేయస్వామి ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం రామచంద్రుడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా కావలి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం, అభిషేకాల అనంతరం కల్యాణ క్రతువును వేద మంత్రోచ్చారణల నడుమ వేడుకగా జరిపారు. నాగిరెడ్డి గారి రెడ్డెమ్మ, ఆదినారాయణరెడ్డి దంపతులు దాతలుగా వ్యవహరించారు.

పసుపులేటికి ఆహ్వానం

నందలూరు : నంద్యాలలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు జాతీయ సమైక్య జీవనం – విలువలు గురించి ఉపన్యసించమని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు, రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌ను కళాశాల యాజమాన్య చైర్మన్ శాంతిరాముడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్‌లు ఆహ్వానిస్తూ పత్రం పంపించారు. ఈనెల 18వ తేదీన సాయంత్రం కళాశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు.

పుస్తకావిష్కరణ


పుస్తక ఆవిష్కరణలో పాల్గొన్న కె.జీవానందం

రాయచోటి టౌన్ : మత విశ్వాసం కన్నా దేశ భక్తి మిన్న అని ఏపీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.జీవానందం పేర్కొన్నారు. మంగళవారం ఆప్ కీ ఆవాజ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1927 డిసెంబర్ 19వ తేదీన భారదేశానికి స్వాతంత్ర్యం కావాలని పోరాటం సాగించి ఉరి కంభాన్ని ముద్దాడాడని పండిట్ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫా ఖుల్లాఖాన్‌ల సంస్మరణ పేరుతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం మతాలకు అతీతంగా ఎందరో మహానుభావులను ఏకం చేసిందన్నారు. కానీ ప్రపంచంలో మతాన్ని మూర్ఖంగా విశ్వసించడం వలన అక్కడక్కడా అల్లర్లు చెలరేగుతున్నాయన్నారు. గణాంకాల ప్రకారం ముస్లింలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని స్పష్టం అవుతోందన్నారు. కార్యక్రమంలో ముస్లిం సామాజిక వేత్తలు పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం


రాయచోటి టౌన్ : పట్టణంలోని ఒక మహిళకు నేషనల్ బ్లడ్ ప్రమోటర్, హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ మైనుద్దీన్ కాన్పు కోసం వచ్చిన గర్భిణికి రక్తదానం చేయించాడు. సోమవారం రాత్రి రాయచోటికి చెందిన ఓ మహిళ కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. రక్తస్రావం కావడంతో అదనంగా రక్తం కావాలని వైద్యులు సూచించండంతో బాధితులు ట్రస్టుని సంప్రదించండంతో స్పందించిన మైనుద్దీన్ చంద్ర అనే యువకుడితో మంగళవారం రక్తదానం చేయించాడు. దీంతో మహిళ బంధువులు ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డికి ఘన నివాళి


మాజీ ఎమ్మెల్యే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

వీరబల్లి : మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కీ.శేలు గాలివీటి విశ్వనాథ రెడ్డి ఎనిమిదవ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కుమారులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, మురళీ రెడ్డి, మనువడు మదన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

సంబేపల్లె : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎంపీపీ కార్యాలయంలో అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు అభివృద్ధి లక్ష్యాలపై అధికారి చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. శిక్షణలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

22న గణిత ప్రతిభా పరీక్ష


కరపత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

రాయచోటి అర్బన్ : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీన గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు వి.బసిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో పరీక్షల కరపత్రాలను విడుదల చేశారు. 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 91776 49784, 94409 67988, 98492 30243 నంబర్లకు సంప్రదించాలంటూ కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల కమిటీ చైర్మన్ పి.నాగేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. అనంతరం వంట ఏజెన్సీల నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.భవిత, ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, రమణయ్య, ఆసీఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతో భావితరాలకు వెలుగునిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

రాజంపేట రూరల్ : విద్యుత్‌ను ఆదా చేసి భావితరాల జీవితాలలో వెలుగులు నింపుదామని వినియోగదారులను విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖర్ రెడ్డి కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఈఈ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ స్థాయిలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యుత్‌శాఖ సిబ్బంది, వివిధ యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొని విద్యుత్‌ను ఆదా చేద్దామంటూ నినదించారు. అనంతరం ఈఈ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు త్రీ స్టార్ రేటింగ్ పైన ఉన్న పరికరాలు వినియోగించాలన్నారు. ఎల్‌ఈడీ లైట్లు వాడటం శ్రేయస్కరమన్నారు. ఏసీలను రిమోట్‌తో ఆఫ్ చేసిన తరువాత స్విచ్ కూడా ఆఫ్ చేయడం వలన విద్యుత్ బిల్లులను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈఈ ఎం.సురేంద్రనాథ్, ఏఈలు సీహెచ్ చంద్రశేఖర్, ఈశ్వర్ రాజు, జేఈలు దస్తగిరి, ఈశ్వరరెడ్డి, కుమార్, సుమంత్, రవి, అకౌంట్స్ ఆఫీసర్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

సిద్దవటం : మండలంలోని డేగనవాడ్లపల్లెకు చెందిన వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు సింగం క్రిష్టారెడ్డి భార్య రాజమ్మ, మూలపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు గార్లు గంగన్న మరదలు మునెమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం వారి మృతదేహాల వద్ద ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నివాళులు అర్పించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


రాజమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఆకేపాటి

దళితుల పట్ల డిప్యూటీ తహసీల్దార్ దురుసు ప్రవర్తన


సచివాలయం వద్ద నిరసన చేస్తున్న గ్రామస్తులు

పుల్లంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించలేదని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కొమ్మనవారిపల్లిలోని సర్వే నెంబరు. 858లో 50 సెంట్ల భూమిని దళితుల శ్మశానికి కేటాయించారు. శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని డిప్యూటీ తహసీల్దార్‌కు కోరేందుకు రెవెన్యూ సదస్సుకు వెళ్లగా ఆమె సమస్యను వినకపోగా దురుసుగా ప్రవర్తించిందని గ్రామస్తులు సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమకు శ్మశానానికి దారి లేక రెండు సంవత్సరాల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించనప్పుడు రెవెన్యూ సదస్సులు ఎందుకని వారు ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాల్సిన డిప్యూటీ తహసీల్దార్ తమపై దురుసుగా ప్రవర్తించారని వాపోయారు. దీనిపై ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్నను వివరణ కోరగా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, శ్మశానానికి సంబంధించిన దారి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. శ్మశానానికి సంబంధించిన దారికి మండల సర్వేయర్ శ్రీరాములు సర్వే చేశారని త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. తాను దళితులపై దురుసుగా ప్రవర్తించలేదని ఆమె తెలియజేశారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తాం

ఓబులవారిపల్లె : రైతుల ఇచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. మంగళవారం కొర్లకుంట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో వివిధ సమస్యలకు పైన 64 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఆర్‌ఐ రామ్మోహన్ నాయుడు, వీఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: సి.కందులవారిపల్లిలో మంగళవారం తహసీల్దార్ మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ గ్రామ పరిధిలో ఎస్సీ, ఎస్టీ నిరుపేదలకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను గ్రామస్తులు కోరగా అందుకు ఆయన స్పందిస్తూ ఈ సమస్యను తక్షణం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలు, రామాంజులు నాయుడు, కాకర్ల నాగార్జున నాయుడు, ప్రత్యేక అధికారి గురుమోహన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం : మండలంలోని పి. కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలను పరిష్కరించాలని పలు భూ ఆక్రమాలపై రైతులు అర్జీలు సమర్పించారు. తమ కుటుంబానికి చెందిన భూమిని కొందరు ఆక్రమించుకున్నారని సర్వే చేసి తమ భూమి తమకు అప్పగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మహిళా రైతు సామ్రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ రైతులు ఫిర్యాదు చేసిన ప్రతి అర్జీకి సమస్యను పరిష్కరిస్తామని, లీగల్‌గా ఉన్న భూ సమస్యలు పరిష్కరించబడవని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు మాధవీలత, ఆర్‌ఐ ప్రసాద్, సర్వేయర్ సుదర్శన్, వీఆర్‌ఓ గంగన్న, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.


చిన్నమండెం: అర్జీలు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారి చంద్రానాయక్, తహసీల్దార్

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభలను మంగళవారం నిర్వహించినట్లు తహసీల్దార్ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి చంద్రానాయక్ ప్రజల నుంచి పలు సమస్యలపై వచ్చిన 137 అర్జీలను స్వీకరించారు. త్వరలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సర్వేయర్ శ్యామల, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిబాబు, ఈఓ కొండారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


చిట్వేలి మండలం సి.కందులవారిపల్లిలో అధికారులకు అర్జీలు ఇస్తున్న గ్రామస్తులు


సిద్దవటం: రెవెన్యూ సదస్సులో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్

రామాపురం : భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం సరస్వతిపల్లె, గువ్వలచెరువు సచివాలయాలలో జరిగిన రెవిన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మణి, ఆర్‌ఐ సమ్మత్‌ఖాన్, సర్పంచ్ మునీర్‌బాషా, వీఆర్‌ఓ సుబ్బారెడ్డి, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు గడికోట భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారిణి మల్లిక పేర్కొన్నారు. మంగళవారం బాలిరెడ్డిపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయదలుచుకుంటే వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రసాయన ఎరువులు వాడకం ద్వారా భూములు సాంద్రత కోల్పోతాయని చెప్పారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. పిల్లి పెసర, జనుము పంటలను సాగుచేసి వాటిని పొలంలో కలియ దున్నడం ద్వారా పంటలకు పోషకాలు అందుతాయని తెలిపారు. చీడపీడలను రానియ్యవని పేర్కొన్నారు. అనంతరం అరటి, బొప్పాయిలో వైరస్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, ఉద్యాన వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రామాపురం : మారుమూల గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ నాయకులు గాలివీడు సురేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిట్లూరు గ్రామం కస్పాలో తిరుపతికి చెందిన రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మండల పరిసరాల ప్రాంతాల నుంచి సుమారు 200 మంది ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం సంతృప్తిగా ఉందని ఆయన పేర్కొన్నారు. శిబిరంలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న 30 మందిని తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కార్యక్రమంలో చెన్నకృష్ణారెడ్డి, దేవదర్శన్ రెడ్డి, రామకృష్ణగౌడ్, సహదేవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ, చిన్నప్ప, లక్ష్మయ్య, రమేష్, రమాదేవి, ఆసుపత్రి వైద్యులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

గాలివీడు : రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం పోలీసు సిబ్బందితో కలసి గాలివీడు – రాయచోటి రహదారి వెంబడి ప్రమాదకర మలుపుల వద్ద దాదాపు 10 హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం సేవించి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఒంటిమిట్ట : గంగపేరూరు గ్రామానికి చెందిన గద్దె భువనేశ్వరి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ. 2,50,454లు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరు అయ్యింది. మంగళవారం చెక్కును తెలుగుదేశం పార్టీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్ : విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంచేందుకు సైంటిఫికల్ ఎక్స్‌పోలు ఎంతో దోహదపడతాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సందీప్ స్కూల్లో ఈ నెల 27, 28వ తేదీలలో జరిగే కలాం విజన్ సైంటిఫికల్ ప్రాజెక్టు ఎక్స్‌పోకు సంబంధించి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరమాటి శివగంగిరెడ్డి, హరినాథరెడ్డి, వినయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి


భవిత కేంద్రం విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ సుబ్బరాయుడు

రాజంపేట రూరల్ : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని ఎంఈఓ దాసరి సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. స్థానిక మన్నూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలను హెచ్‌ఎం ప్రమీల అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ సుబ్బరాయుడు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను స్కూల్‌కు పంపడం వలన వారిలో మానసిక ధైర్యం, ఉల్లాసం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలలో రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, భవిత ఉపాధ్యాయులు మాధవి, నాగమణి, ఫిజియోథెరపిస్ట్ వెంకటప్రసాద్, కేసీటీ ట్రస్ట్ చైర్మన్ కల్పన, భవిత విద్యార్థులు పాల్గొన్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ మాలపల్లికు పక్కనే ఉన్న చెరువు అలుగు సమీపంలో 11కేవీ స్తంభం, ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా తయారైందని ఆయకట్టు రైతులు తెలియజేశారు. ఈదారి వెంబడే పొలాలకు రైతులు రాకపోకలు సాగించాలని, పెద్ద గాలివానకు నెలకొరిగి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.